క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు రూ.5.40 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు పత్రాలు సిద్ధం

తిరువూరు: రబీ సీజన్లో పంటలు సాగుచేసే రైతుల వివరాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారిణి పద్మ తెలిపారు. ఈ క్రాప్ లోపంటలు నమోదు చేయించుకుని వేలి ముద్రలు వేసిన రైతులు తమ సమీప రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు భౌతిక ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని సూచించారు.

ఉద్యోగాలకు 23 మంది ఎంపిక

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 23 మంది బీటెక్ విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు తెలిపారు. టీవీఎస్ సుందరం సంస్థ మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో రాత పరీక్ష, బృంద చర్చల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశారన్నారు. ఇటీవల మాల్ టిక్ సంస్థ కూడా ఇంటర్వ్యూలు నిర్వహించి నలుగురు విద్యార్థులను ఎంపిక చేసిందని తెలియజేశారు.

నెమలి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

గంపలగూడెం: మండలంలోని నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. సభ్యులతో ఆలయ సహాయ కమిషనర్ సాంబశివరావు ప్రమాణం చేయించారు. ముందుగా 9 మంది సభ్యులు చైర్‌పర్సన్‌గా కావూరి శశిరేఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా కొండపల్లి కొండలరావు, మోదుగు సుహాసిని, బండి చెన్నమ్మ, మనుబోలు వెంకటేశ్వర్లు, తుటారి పూర్ణచంద్రరావు, గరిడేపల్లి వెంకటరమణ, కటారు చిన్న కృష్ణ, మల్కాపురం రామకృష్ణ ప్రమాణం చేశారు. అనంతరం స్వామివారి పూజలో పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్ సీఈని కలిసిన యూనియన్ నేతలు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నూతన చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.నాగరాజును ఏపీ పవర్ జనరేటింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ–1535 నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నే శ్రీనివాస్‌కుమార్, నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. సంస్థ అభివృద్ధికి యూనియన్ నాయకులు, ఉద్యోగులు సహకరించాలని సీఈ సూచించారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై మెరుపు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. రమణక్కపేటలో శుక్రవారం మధ్యాహ్నం రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.1,130 నగదు, స్వాధీనం చేసుకున్నారు. వీరిని శనివారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు.

పథకాలు అందాలంటే సీఎంగా జగన్ ఉండాలి

- ఎంపీ కేశినేని శ్రీనివాస్
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

విజయవాడరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందంగా ఉంటారని, సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీ కేశినేని శ్రీనివాస్ అన్నారు. పైడూరుపాడు గ్రామంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలను శుక్రవారం ఎంపీ కేశినేని శ్రీనివాస్, మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచి వి.సీతారామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. చంద్రబాబు గెలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలేవి అమలు జరగవన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి తనను, సర్నాల తిరుపతిరావును అత్యంత భారీమెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇంటికే వస్తున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెడితే టీడీపీ 8 మందిని తనపై పోటీగా నిలబెట్టేందుకు సర్వే చేపించిందన్నారు. తనకు ఒక ఓటు, ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి ఒక ఓటు వేసి గెలిపించాలని కోరారు. పైడూరుపాడు గ్రామంలో 154 మందికి కొత్త గా ఇళ్ల స్థలాలను మళ్లీ మన ప్రభుత్వంలో అందజేస్తామన్నారు. ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, వైస్ ఎంపీపీ వి.సురేష్, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బయ్యారపు కల్పన, డాక్టర్ పద్మావతి, వ్యవసాయాధికారి రంగనాథ్‌బాబు, కిషోర్‌బాబు, వెంకటరత్నం, పలువురు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. తొలుత ఎంపీ కేశినేని శ్రీనివాస్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, సర్నాల తిరుపతిరావు.. బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



పైడూరుపాడులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్, సర్నాల, తదితరులు

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

మైలవరం: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ ప్రభుత్వం పనిచేస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) తెలిపారు. మైలవరం రైతు బజారులో నూతనంగా నిర్మించిన కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎంపీ కేశినేని శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, అనంతరం కూరగాయలు అమ్ముకునే రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైలవరం రైతు బజారులో 54 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ఎండకు, వానకు ఇబ్బందులు పడకుండా పక్కాగా షాపులు నిర్మించామని తెలిపారు. అనంతరం రైతు బజారులోని ప్రెస్ క్లబ్ ఆఫ్ మైలవరం కార్యాలయాన్ని సందర్శించారు. నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ మంజుభార్గవి, వ్యవసాయ శాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

మైలవరం: మైలవరంలో స్థానిక శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ సందర్శించారు. మన నిత్య జీవితంలో సైన్స్ ఒక భాగమని, నేడు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం రోజు రోజుకు కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. సైన్స్ ఫెయిర్ పోటీలలో విజేతలకు మెడల్స్, సర్టిఫికేట్‌లు అందజేశారు.



విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

రెడ్డిగూడెం: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. మండలంలోని పాతనాగులూరు గ్రామంలో ఎంపీ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాలలో చంద్రబాబు కన్నా మూడురెట్లు అభివృద్ధి సాధించిన నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు, మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బలగాని తిరుపతిరావు, సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కొలుసు వెంకటేశ్వరరావు, రుద్రవరం పీఏసీఎస్ అధ్యక్షుడు కొనసాని శ్రీనివాసరావు, స్థలదాత తోట వెంకటసుబ్బారావు, గుజ్జుల కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం జగన్



తిరువూరు తోకపల్లిలో స్వామిదాసు ప్రచారం

తిరువూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. శుక్రవారం తిరువూరు పట్టణంలోని తోకపల్లిలో గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. పట్టణంలో త్వరలోనే డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కారమవు తాయన్నారు. నగర పంచాయతీ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, పాలం రమాదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ లాక్రోస్ జట్టుకు ఎంపిక

ఇబ్రహీంపట్నం: జాతీయ లాక్రోస్ క్రీడా జట్టుకు మండలంలోని కిలేశపురం గ్రామానికి చెందిన బాణావత్ వెంకటేష్ నాయక్ ఎంపికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్టీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో ఒంగోలు జిల్లా సింగరాయకొండలో జరిగిన రాష్ట్రస్థాయి లాక్రోస్ మెన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఆరుగురు సభ్యులు గల జట్టులో బాణావత్ వెంకటేష్‌నాయక్ ఉత్తమ ప్రతిభతో జాతీయ జట్టులో స్థానం సంపాదించాడు. జిల్లా కార్యదర్శి అప్పలస్వామి, తదితరులు వెంకటేష్‌ను అభినందించారు.

ఎన్ని పార్టీలు ఏకమైనా విజయం వైఎస్సార్ సీపీదే

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నూజివీడు: రాబోయే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజా మద్దతు మెండుగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఘన విజయం సాధించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారం చేపడుతుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి, ఏరియా ఆసుపత్రిలో నాబార్డు నిధులు రూ.4 కోట్లతో నిర్మించనున్న బీ బ్లాక్ నాలుగో ఫ్లోర్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు బూటకపు హామీలు, అనైతిక పొత్తులతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మొద్దని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లోనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి చూపించి విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులిరువురిని గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మరింత పురోగమిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్, సీనియర్ వైద్యులు నరేంద్రసింగ్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



నూజివీడులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని పీహెచ్‌సీ వైద్యురాలు చంద్రిక అన్నారు. గుంటుపల్లి సచివాలయం–2 పరిధిలో శుక్రవారం జరిగిన ఆరోగ్య శిబిరం ఆమె ప్రారంభించారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఆరోగ్య సురక్ష శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధి తీవ్రతను బట్టి కార్పొరేట్ వైద్యం పొందొచ్చన్నారు. రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ స్పందన, ఈవోపీఆర్డీ మనోజ్ కుమార్, సీహెచ్‌వో నారాయణ, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఇంటి వద్దకే వైద్యం

జి.కొండూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఇంటి వద్దకే వైద్యం అందుతోందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండలంలోని వెల్లటూరు సచివాలయం–2 ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లను ఎంపీపీ అందజేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్వేత మాట్లాడుతూ ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 432 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జాస్తి జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండలంలోని కనసానపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 422 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీనా, డాక్టర్ మాధురి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చనుబండ సచివాలయం–1 పరిధిలో శుక్రవారం అధికారులు జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమలో సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాదు, జాషువా, సోనీ బేబీ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లోని పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ప్రభుత్వం 35 మందికి మంజూరు చేసిన రూ.18.60 లక్షలకు విలువైన చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు చికిత్స చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో చికిత్స పరిమితిని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, తుక్కులూరు సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, నాయకులు పాలడుగు నాని పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తాతకుంట్ల (విస్సన్నపేట): గర్భిణులు క్రమం తప్పకుండా పోషకవిలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ జి.సత్యవతి అన్నారు. ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు పరిధిలో తాతకుంట్ల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమంలో సీడీపీఓ శుక్రవారం పాల్గొన్నారు. తల్లులు, గర్భిణులకు పోషకాహార ప్రాధాన్యత, ఆకుకూరలు, చిరుధాన్యాల ఉపయోగం గురించి వివరించారు. ఐరన్ లోపం రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, సుజాత, దేవిర, నాగమణి, మంగమ్మ, నిర్మల పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాక

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విస్సన్నపేటలో శనివారం ఉదయం 6 గంటల నుంచి గుడ్‌మార్నింగ్ వాకింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఎస్సీ ఏరియాలో ప్రజాసమస్యలుతెలుసుకుంటారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు వెంకటకుటుంబరావు శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

జి.కొండూరు: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక కమ్యూనిటీహాలులో తహసీల్దార్ వీవీఎల్ నర్సింహారావు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నర్సింహారావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు అధికారుల విధులకు ఆటంకం కలగకుండా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సీఐ కిశోర్ బాబు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ

ముసునూరు: ఉపాధి కూలీల ఉపశమనానికి అవసరమైన ప్రథమ చికిత్స కిట్లు, సమగ్ర సౌకర్యాలు కలిపిస్తున్నట్లు ఏపీఓ రోజ్‌లీల తెలిపారు. గోపవరంలో సప్లై చానల్స్‌లో చేపట్టిన ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు గాయపడితే, వారికి తక్షణ చికిత్స కోసం ప్రథమ చికిత్స కిట్లను ఏర్పాటు చేశామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, ఉపాధి హామీ సిబ్బంది, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

చాట్రాయి: చాట్రాయి గ్రామానికి చెందిన కొండపల్లి రఘునాథరెడ్డి (కెనడా) దంపతులు స్థానిక జెడ్పీ హైస్కూలు 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న 30 విద్యార్థులకు శుక్రవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. తన చదువుకున్న పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలన్న ఆశయంతో ప్యాడ్‌లు అందించానని దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

చెర్‌పర్సన్ దంపతులకు సత్కారం

కాట్రేనిపాడు(ముసునూరు): సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలు చేస్తూనే, ఇటీవల నూతనంగా నూజివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్‌గా నియమితురాలైన కంబాల కృష్ణవేణి రాంబాబు దంపతులను పలువురు అభినందించి, ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కాట్రేనిపాడులో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కాట్రేనిపాడు వైఎస్సార్ సీపీ నేతలు, విద్యావేత్తలు శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ కంబాల దాసు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న గ్రామ వలంటీర్లు

'పది' విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ముసునూరు: విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలమని హెచ్‌ఎం అబ్బాస్ అన్నారు. చెక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆయన అధ్యక్షతన 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు, తమ సీనియర్లు 10వ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షల తెలిపి, వీడ్కోలు పలికారు. జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. విద్యార్థులసాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.ఉపాధ్యాయులు రాజశేఖర్, సత్యనారాయణ,పద్మ కిషోర్, విజయానంద్, జోసఫ్, అబ్రహాం, రాంబాబు,పాల్గొ న్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. ముసునూరులో పేకాట శిబిరంపై శుక్రవారం దాడి చేశారు. ఇద్దరిని అదుపులోనికి తీసుకొని, రూ.1, 020 నగదు, స్వాధీనం చేసుకున్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించిన సీఎం జగన్

తిరువూరు: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న వెనుకబడిన తరగతులను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ అన్నారు. శుక్రవారం తిరువూరులో బీసీ సంఘ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వెనుకబడిన తరగతులు వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడాలని మారేష్ కోరారు. రాజ్యాంగ పదవుల్లో అత్యధిక స్థానాలు బీసీలకు కేటాయించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బీసీ సంఘ మహిళా విభాగ అధ్యక్షురాలు బేబీరాణి, జిల్లా గౌరవాధ్యక్షుడు కాలసాని నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల వెంకట్, ఉపాధ్యక్షుడు కోమటి చెన్నారావు, నియోజకవర్గ అధ్యక్షుడు దండుగుల శివశంకర్, తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు మండలాల అధ్యక్షుడు వెకంటరమణ, శ్రీనివాసరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో బీసీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మారేష్

ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు

గంపలగూడెం: ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు శుక్రవారం తెలిపారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్, తోటమూల గాయత్రి పబ్లిక్ స్కూల్, సరస్వతి విద్యాలయం, శాన్‌జోష్ స్కూల్, ఊటుకూరు హైస్కూల్, సిద్ధార్థ విద్యాలయాలలో పరీక్షా కేంద్రాలు కొనసాగుతాయన్నారు. మండలంలో మొత్తం 799 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని, వీరిలో 554 మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి 244 మంది ప్రైవేటు స్కూళ్ల నుంచి హాజరవుతారని తెలిపారు.

ముగిసిన సెకండ్ ఇంటర్ పరీక్షలు.. 69 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ముగిశాయి. పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన రసాయనశాస్త్రం, కామర్స్ సబ్జెక్టుల పరీక్షకు 69 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల, శ్రీ సిద్దార్థ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవ్వగా, 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఈ పరీక్షకు పట్టణంలోని ఐదు కేంద్రాల్లో కలిపి 1,367 మంది విద్యార్థులకు 1,298 మంది పరీక్షలకు హాజరవగా, 69 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా దుర్గాప్రసాద్, టీ విజయ, ఉమాదేవి, సీహెచ్ జాన్, చంద్రశేఖర వర్మ వ్యవహరించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మైలవరం: హక్కులపై వినియోగదారులకు అవగాహన ఉండాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సం శుక్రవారం జరిగింది. విద్యార్థులు వినియోగదారుల హక్కుల గురించి ప్రజల్లో అవగాహనకల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. కామర్స్ విభాగాధిపతి ఎమ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ నకిలీలపై వినియోగదారులు ఏ విధమైన జాగ్రతలు తీసుకోవాలో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ వస్తువుల నాణ్యత సామర్థ్యం, స్వచ్ఛత, ధరల సమాచారాన్ని అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అధ్యాపకులు జి.నారాయణరావు, రామారావు, శ్యాంసుందరరావు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ల ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే బ్యూటీ పార్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లోని బ్యూటీ పార్లర్లను వివిధ ప్రభుత్వ శాఖల పర్యవేక్షణలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల అమలు తీరుపై ఆరా తీశారు. షాపు లైసెన్స్‌లు తనిఖీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎస్ఐ బి.అనూష, సీహెచ్‌వో కేవీ.శివనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ఖాదిర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.